పాపం పసివాళ్లు

చిట్టిచేతుల చిన్నారులు..బాల కార్మికులవుతున్నారు. తల్లిదండ్రుల పేదరికం ఒకవైపు. నిరక్షరాస్యత మరోవైపు..వెరసి స్వేచ్ఛా విహంగంలో విహరించాల్సిన బాల్యం బందీగా మారింది. అమ్మ ఆలన..నాన్న పాలన తెలియని పసి మొగ్గలు కొందరు.. భిక్షాటన చేస్తున్నారు. చట్టాలు ఎన్నున్నా వీరిని మాత్రం ఆపలేకపోతున్నాయి. -బీచ్‌రోడ్డు


బీచ్‌రోడ్డులో గాంధీ వేషధారణతో భిక్షాటన చేస్తున్న బాలుడు

బీచ్ రోడ్డులో ఎక్కడ చూసినా చిన్నారుల భిక్షాటన ● ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద అదే పరిస్థితి ● పనిచేయని 1098 చైల్డ్‌లైన్


ఆర్కే బీచ్ వద్ద భిక్షాటన చేస్తున్న బాలుడు

రోడ్లపై భిక్షాటన చేసే వారిని చూస్తే ఎవరికైనా జాలి కలుగుతుంది. అందునా పసి పిల్లలు నడి రోడ్డులో భిక్షటన చేస్తే ఎవరికైనా కడుపు తరుక్కుపోతుంది. దీంతో పిల్లల అవస్థను చూడలేక ప్రయాణికులు తమకు తోచినంత వారికి ఇస్తుంటారు. పేదరికం, పరిస్థితులు, ఇతర కారణాల వల్ల చాలా మంది భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. జన సంచారం ఉండే రద్దీ ప్రాంతాలు, దేవాలయాలు, సిగ్నల్స్ పడే ప్రాంతాల్లో ఎక్కువగా వీరు యాచిస్తూ ఉంటారు. బస్సుల్లో, రైళ్లలో కూడా భిక్షాటన చేస్తుంటారు. వృద్ధులు, చిన్న పిల్లలు, పసిపిల్లలు, దివ్యాంగులు అడగ్గానే.. పాపం అని దయ తలచి కొంత మంది డబ్బులు అందిస్తుంటారు. క్రమంగా ఇది ఓ వృత్తిలా మారిపోయింది. రంగుల ప్రపంచంలో స్వేచ్ఛా విహంగంలా ఎగరాల్సిన బాల్యం పర్యాటక ప్రాంతాల్లో బిచ్చమెత్తుకుంటూ ఉంటే మనసు తరుక్కుపోతోంది.

చర్మ వ్యాధులతో సతమతం

పర్యాటక ప్రాంతాల్లో శరీరంపై వివిధ రంగులు పులుముకుని, వివిధ వేషధారణలో భిక్షాటన చేస్తున్న చిన్నారులు చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. అంతేకాకుండా చాలా సేపు కాదలకుండా నిల్చోవటం వలన శరీరంపై ఒత్తిడి అధికమవుతోంది. అయితే పర్యాటక ప్రాంతాల్లో బాలల భిక్షాటనపై సందర్శకులు ఫిర్యాదు చేయాలని అనుకున్న చైల్డ్ లైన్ నంబర్ పనిచేయడం లేదు.. ఒకవేళ పనిచేసినా సిబ్బంది స్పందించడం లేదు.


చంటిబిడ్డతో భిక్షాటన చేస్తున్న మహిళ

పెరుగుతున్న చిన్నారుల భిక్షాటన

నగరంలోని పర్యాటక ప్రాంతాల్లో రోజుకు రోజుకు భిక్షాటన చేసే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. చిన్నారులకు వివిధ వేషధారణలో సిద్ధం చేసి భిక్షాటనకు పంపుతున్నారు. బీచ్ రోడ్డులో ఎక్కడ చూసినా బాలలు భిక్షాటన చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అరికట్టాల్సిన అధికారులు బిచ్చమేసి పోతున్నారు తప్ప..కనీసం పట్టించుకోవడం లేదు. పోలీసు అధికారుల సంగతి చెప్పాల్సిన అవసరమే లేదు..ట్రాఫిక్ సింగల్స్ వద్ద వారి ముందే భిక్షాటన చేస్తున్న సరే తమకు ఏమీ పట్టన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో బెగ్గింగ్ మాఫియా నగరమంతా వ్యాపిస్తోంది.

అక్కరకురాని 1098 చైల్డ్‌లైన్

బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు, బాలల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన 1098 చైల్డ్‌లైన్ పని చేయడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్వాహణను స్వచ్ఛంధ సంస్థకు అప్పగించటంతో కాల్ చేయగానే స్పందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లా బాలల పరిరక్షణ అధికారులకు 1098 చైల్డ్‌లైన్ నిర్వహణ బాధ్యత అప్పగించింది. అయితే సరిపడే సిబ్బంది లేక సేవలను అందించలేకపోతోంది. పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వకపోవడంతో చైల్డ్ లైన్ నిర్వహణను సీరియస్‌గా తీసుకోవడం లేదు.

పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం..



బాలల భిక్షాటన తమ దృష్టికి వచ్చింది. ఇప్పటికే నగర పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాం. తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించి బాలలను పరిరక్షించేందుకు అధికారులతో పాటు పోలీసు శాఖ కూడా సమన్వయంతో పని చేస్తుందని హామీ ఇచ్చారు. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పిల్లలను సంరక్షిస్తాం.
-గొండు సీతారాం, సభ్యుడు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్



క్లుప్తంగా

గ్యాస్ భద్రత తనిఖీలు


ఆరిలోవలో గ్యాస్ సిలిండర్, పైపు తనిఖీ చేసి ఓటీపీ నమోదు చేస్తున్న డెలివరీ బాయ్స్

ఆరిలోవ: ఎల్‌పీజీ గ్యాస్ సిబ్బంది కస్టమర్ భద్రతా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఆరిలోవ ప్రాంతంలో హెచ్‌పీ గ్యాస్ వినియోగదారుల నివాసాలకు గ్యాస్ డెలివరీ బాయ్స్ వెళ్లి తనిఖీలు చేశారు. వంట గదిలో గ్యాస్ పైపు, గ్యాస్ సిలిండర్ చెక్ చేశారు. పైపునకు లీక్‌లు ఎక్కడ ఉన్నాయో పరిశీలించారు. లీకవుతున్న పైపులను వెంటనే మార్చుకోవాలని సూచించారు. వంట గదిలో గ్యాస్‌ను సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు. గ్యాస్ తనిఖీ చేసిన అనంతరం దానికి సంబంధించిన వివరాలను వినియోగదార్ల ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేశారు.

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు

ఆరిలోవ: ఆరిలోవ కాలనీలో ఓ కారు ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బీఆర్‌టీఎస్ రోడ్డులో స్కిల్ డెవెలెప్‌మెంట్ కూడలి నుంచి ఆరిలోవ కాలనీకి ఓ కారు మితిమీరిన వేగంతో వస్తోంది. అదుపు తప్పిన ఆ కారు శివాజీనగర్ శివాలయం ఎదురుగా శ్రీకాంత్‌నగర్‌కు తిరిగే మలుపు వద్ద డివైడర్‌ను ఢీకొంది. దీంతో పల్టీలు కొట్టింది. వెంటనే స్థానికులు కారు వద్దకు చేరుకొని కారులో ఉన్న ఇద్దరు యువకులను బయటకు తీశారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకొన్నారు. కారు ముందు భాగం నుజ్జయింది. దీనిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

అలేఖ్యకు బంగారు పతకం


అభినందిస్తున్న కామేశ్వరరావు

మహారాణిపేట: డెహ్రాడూన్‌లో అక్టోబర్ మొదటి వారంలో జరిగిన జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖలోని గాయత్రీ విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.అలేఖ్య బంగారు పతకం కైవసం చేసుకుంది. పోటీలను అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ సమాఖ్య పర్యవేక్షణలో కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించాయి. అలేఖ్య టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ పొందింది. అలేఖ్యను గాయత్రి విద్యా పరిషత్ సంయుక్త కార్యదర్శి డీవీఎస్ కామేశ్వరరావు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తమ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని ప్రియవర్షిని జాతీయస్థాయి రోలర్ స్కాటింగ్ చాంపియన్ షిప్‌నకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రపంచ విద్యార్థి దినోత్సవం జరిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, పలువురు అధ్యాపకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కలాం పట్టుదల, కృషిని కొనియాడారు. కలాం జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని తమ ప్రతిభ పెంచుకోవాలని, భవిష్యత్ నాయకులుగా మారే దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ పీఎల్ శరణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పురాతన వస్తువుల ప్రదర్శనకు ప్రశంసలు


శివప్రకాష్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవ కమిటీ


పురాతన నాణాల గురించి వివరిస్తున్న శివప్రకాష్

మద్దిలపాలెం: నగరానికి చెందిన సహకార బ్యాంకు విశ్రాంత ఉద్యోగి జీఎస్ శివప్రకాష్‌కు పురాతన వస్తువులు, నాణాలు, స్టాంపులు సేకరణలో దిట్ట. వివిధ జిల్లాలలో తరచూ ప్రదర్శనలు పచ్చి విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంటారు. ఈ క్రమంలో విజయనగరం పైడితల్లమ్మ అమ్మవారి ఉత్సవంలో ఈ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ సేద్ మాధవన్ ఆదేశానుసారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విజయనగరం ఉత్సవాల్లో శివప్రకాష్ పురాతన నాణేలు, వస్తువులను ప్రదర్శించారు.పలువురు ప్రముఖులు తిలకించి శివప్రకాష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు ప్రశంసపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు.

ఉత్తర ఎమ్మెల్యే దృష్టికి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న పీవీవీ మోహన్

మద్దిలపాలెం: ఏపీ ప్రభుత్వ ప్రజా రవాణా శాఖలో జిల్లా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కోరామని ఎన్ఎంయూఏ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ తెలిపారు. మంగళవారం ఆయను నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని మోహన్ తెలిపారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో జోనల్ చైర్మన్ సూర్యం, రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు గండి రామకృష్ణ, బి.నీలకంఠం, జిల్లా చైర్మన్ ప్రాన్, డివిజనల్ కార్యదర్శి ఏకే శివాజీ, వాల్తేర్ డిపో కార్యదర్శి ఆర్. వసంతరావు, మద్దిలపాలెం కార్యదర్శి చిన్నా అన్ని డిపోల ఉద్యోగులు మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

యూపీహెచ్‌సీ సేవలపై ఆరా


పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సీతమ్మధార: గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. స్థానిక రేసపువానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతాన్ని, సరకుల నిల్వలను పరిశీలించారు. పిల్లల నేమ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో కాసేపు చిన్నారులతో ముచ్చటించారు. వారితో సరదాగా గడిపారు. తనిఖీలో భాగంగా నిర్వాహకులతో మాట్లాడిన ఆయన పలు అంశాలపై సూచనలు చేశారు. నెలవారీ సరకులు, టీహెచ్‌ఆర్, కేంద్రానికి వస్తున్న చిన్నారులకు అందిస్తున్న ఆహారం తదితర అంశాలపై నిర్వాహకులను ఆరా తీశారు. లోపాలు తలెత్తకుండా సరకులు అందజేయాలని, చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అక్కడి వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాజ్యలక్ష్మి, ఆయా వున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి..

ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం సేవలందించాలని, సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. పాత రేసపువానిపాలెంలోని యూపీహెచ్‌సీని మంగళవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను గమనించారు. ఓపీ సంఖ్య, అందుబాటులో ఉన్న మందుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అక్కడికి విచ్చేసిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల హాజరు పుస్తకాలు, ఇతర రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారి మన్మోహన్, సిబ్బంది ఉన్నారు.

సొంత నిధులతోనే పోర్టు ఆస్పత్రి నిర్వహించాలి


పోర్టు ఆస్పత్రి వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షలలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతోనే నిర్వహించాలని, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరికాదని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలనే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 15వ రోజుకు చేరాయి. మంగళవారం దీక్షలను సీఐటీయూ ఆలిండియా ఫెడరేషన్ కార్యదర్శి బి. జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పోర్టు ట్రస్ట్ ఏర్పడి 50 ఏళ్లు అయిన సందర్భంగా పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ఏర్పడిందని, దీని ఏర్పాటుకు కార్మికులు రక్తాన్ని ధార పోసారని, కానీ కార్మికుల కష్టాలను మరిచి ఇప్పుడు దీనిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆరోపించారు. ఈ దీక్షలలో సీఐటీయూ నాయకులు కె. సత్యనారాయణ, జె. సత్యనారాయణ, బి. లక్ష్మణరావు, కెఎస్ కుమార్ పాల్గొన్నారు.

● గంగమ్మ ఒడికి దుర్గమ్మ


దసరా మహోత్సవంలో భాగంగా దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని నగరంలో వివిధ చోట్ల నెలకొల్పిన దుర్గామాత విగ్రహాలు భక్తులతో విశేష పూజలందుకుని మంగళవారం గంగమ్మ ఒడికి చేరాయి. ఏయూ మీదుగా పెదజాలారిపేట వద్ద సముద్రంలో దుర్గమ్మ విగ్రహాలను నిమజ్జనం చేశారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి దుర్గామాత మట్టి విగ్రహాలు ఒక్కొక్కటిగా ఊరేగింపుగా తీరానికి తరలివచ్చాయి.
- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గొప్ప చరిత్రకారుడు గద్దర్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప చరిత్రకారుడు గద్దర్ అని ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయ రావు పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గద్దర్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు, బహుజనుల కోసం తన జీవితాంతం సాహిత్య సేవ చేశారని గుర్తు చేశారు. తన పాటతో, గళంతో ప్రభుత్వాలని కడవరకు ప్రశ్నించారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ఒ.జాన్ మాట్లాడుతూ ఈ నెల 20న ఉదయం 10 గంటలకు టీఎల్ఎన్ సమావేశ మందిరంలోను, మధ్యాహ్నం 2 గంటలకు పౌర గ్రంథాలయంలో గద్దర్ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు రీసెర్చ్ స్కాలర్స్, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు ప్రేమానందం, జర్ర అప్పారావు, పాటల తూట ఉదయభాస్కర్, ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ, అంబేద్కర్, ఆరేటి మహేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ–సీ ఎంప్లాయీస్ (టీచర్స్) వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.షారన్ రాజు, మోహన్, జై భీమ్ ప్రకాష్, రాయ్, రమణ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి చైతన్య ఉమెన్స్ కాలేజ్ విరాళం


రిజిస్ట్రార్‌కు నమూనా చెక్కు అందజేస్తున్న చైతన్య కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రతినిధులు

విశాఖ సిటీ: వరద బాధితుల సహాయార్థం గాజువాకలోని చైతన్య కాలేజ్ ఫర్ ఉమెన్ రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. మంగళవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్ ధనుంజయరావును కళాశాల ప్రతినిధులు కలిసి విరాళానికి సంబంధించిన చెక్‌ను అందజేశారు. ఈ విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి పంపాలని కోరారు. ఈ సందర్భంగా చైతన్య కళాశాల ప్రతినిధులు ఏయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పాఠశాలలు తనిఖీ చేసిన డిప్యూటీ డైరెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ రామారావు

విశాఖ విద్య: మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసే క్రమంలో భాగంగా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు బుధవారం నగరంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని కేడీపీఎం ఉన్నత పాఠశాల, ఎంవీపీలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం రుచి ఎలా ఉందనేది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీఎం పోషన్ కమిటీ సభ్యుడిగా ఇక నుంచి పాఠశాలల్లో అమలయ్యే భోజనం పథకం తీరును ఆకస్మికంగా పరిశీలించినట్టు చెప్పారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కుటుంబం చెంతకు వివాహిత

అల్లిపురం: భర్త వేరే పెళ్లి చేసుకోవడంతో ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన పాడేరుకు చెందిన భగత కులానికి చెందిన వివాహితను ఏయూటీడీ ప్రతినిధులు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాల ప్రకారం ముంచంగిపుట్టు మండలం, దారెల పంచాయతీ, రంగలసింగి గ్రామానికి చెందిన సుక్రీవ్ మహాదేవ్ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. అతని కుమార్తె కె. మహికి పెళ్లి చేసి పంపించాడు. ఆమె భర్త ఆమెతో నిత్యం గొడవ పడటమే కాకుండా కుమార్తెతో సహా కన్నవారి ఇంట్లో వదిలిపోయాడు. దీంతో ఆమె తన 5 ఏళ్ల కూతురిని తల్లిదండ్రుల వద్ద వదిలిపెట్టి విశాఖపట్నం వచ్చేసింది. రైల్వే స్టేషన్‌లో రెస్క్యూ చేస్తున్న సమయంలో ఆమెను గుర్తించిన ఏయూటీడీ సిబ్బంది ఆమెను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ మహిళా షెల్టర్‌కు తరలించారు. అక్కడి నుంచి ఆమె రెండు సార్లు తప్పించుకు పోయేందుకు ప్రయత్నించడంతో టూటౌన్ పోలీసులు ఆమెను తీసుకువచ్చారు. ఆమెకు ఒడియా భాష మాత్రమే రావటంతో పాడేరులో పని చేస్తున్న ఆదివాసీ మిత్ర సంస్థ డైరెక్టర్ మన్మథరావుతో మాట్లాడించి ఆమె పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఆమె తల్లిదండ్రుల వివరాలు తెలియటంతో ఆమెను కారులో పాడేరు తీసుకెళ్లి తండ్రికి, గ్రామ అధ్యక్షుడు, ఆదివాసీ నాయకులైన పాంగి పాండులకు మంగళవారం అప్పగించినట్లు తెలిపారు.

కనువిందు చేసిన ఇంద్ర ధనస్సు


రవీంద్రగనర్ వద్ద రెండు కొండలను కలుపుతున్నట్లు కనిపిస్తున్న ఇంద్ర ధనస్సు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఈ ప్రాంతంలో ఉదయం ఎండ– వర్షం పడగా..ఏడు రంగులతో ఇంద్రధనస్సు రెండు కొండలను కలుపుతున్నట్లు కనిపించింది. శాంతినగర్ కొండను, రవీంద్రనగర్‌ను ఆనుకొని కంబాలకొండను కలుపుతున్నట్లు కనువిందు చేసింది.